క్లుప్తంగా

వాటర్ ప్లాంట్లలో పరిశుభ్రత పాటించాలి



జరిమానా విధిస్తున్న మున్సిపల్ అధికారులు

కోరుట్ల: పట్టణంలోని వాటర్‌ప్లాంట్లలో తప్పనిసరిగా పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు పట్టణంలోని పలు వాటర్ సప్లై ప్లాంట్లను తనిఖీ చేశారు. అపరిశుభ్ర బాటిళ్లలో నీళ్లను సరఫరా చేస్తున్న ప్లాంట్లకు జరిమానా విధించారు. ప్లాంట్ నిర్వహణకు అవసరమైన లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. లేనిచో సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానందం, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రెయినేజీ పరిశీలన



డ్రెయినేజీ పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ జ్యోతి

జగిత్యాల: పట్టణంలోని 25వ వార్డులో శుక్రవారం డ్రెయినేజీలను మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి పరిశీలించారు. డ్రెయినేజీలను తీయకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆమె వెంట కౌన్సిలర్లు ఉన్నారు.

సమాజాభివృద్ధిలో యువత భాగమవ్వాలి



విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేసిన కమిటీ సభ్యులు

మల్యాల: యువత సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని శివాజీ యువసేన అధ్యక్షుడు పోరెడ్డి రంజిత్ అన్నారు. మండలంలోని మ్యాడంపల్లిలో శివాజీ విగ్రహం ఏర్పాటు చేసేందుకు శుక్రవారం శివాజీ యువసేన అధ్యక్షుడు పోరెడ్డి రంజిత్, కార్యవర్గ సభ్యులు భూమిపూజ చేశారు. యువత శివాజీని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కొక్కెర మల్లేశ్ యాదవ్, నరేందర్, రాయిని రాజు, ముదుగంటి కొండల్ రెడ్డి, మాజీ సర్పంచ్ రౌతు రవి తదితరులు పాల్గొన్నారు.

మూల్యాంకన భత్యం చెల్లించాలి



వినతిపత్రం అందిస్తున్న తపస్ నాయకులు

జగిత్యాల: మూల్యాంకన భత్యం చెల్లించాలని తపస్ నాయకులు శుక్రవారం డీఈవో జగన్మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించిన దాదాపు 600 మంది ఉపాధ్యాయులకు పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకన భత్యాన్ని ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోనగిరి దేవయ్య, ప్రసాద్‌రావు, నరేందర్‌రెడ్డి, మహిపాల్‌రావు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ

మల్లాపూర్: నిరుద్యోగుల యువతీ యువకులకు ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమ్మక్కపేట, నాగారం, రాయికల్‌లో నిర్వహిస్తున్న వృత్తి, విద్య ఉచిత శిక్షణ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రతిమ ఫౌండేషన్ ఆర్గనైజర్ పడకంటి వర్ధిని అన్నారు. మండలంలోని చిట్టాపూర్‌లో శుక్రవారం స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రతిమ ఫౌండేషన్ ఉచిత శిక్షణపై అవగాహన కల్పించారు. ఏసీ మెకానిక్, ఫ్రీజ్ మెకానిజం, మోటార్‌సైకిల్ రిపేరింగ్, హౌజ్‌వైరింగ్, ఎలక్ట్రీషన్, ప్లంబింగ్, టైలరింగ్ ఆటో మొబైల్ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 18 ఏళ్ల నుంచి 33 సంలలోపు వయస్సులోపు వారు అర్హులని, విద్యార్హత, ఆధార్, కుల ధ్రువీకరణ పత్రాలు, 3 పాస్‌పోర్ట్‌సైజ్ ఫోటోలతో శిక్షణ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణ తరగతుల్లో పాల్గొనే యువతకు ఉచిత వసతి, భోజనం కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు నేరుగా గాని, 9492501465 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

నిధులు మంజూరైనా పనులేవి?

- మండలంలో రోడ్లకు రూ.7 కోట్లు మంజూరు
- ప్రారంభం కాని పనులు
- ఏడు నెలలుగా ఎదురుచూస్తున్న ప్రజలు



కథలాపూర్- చింతకుంట మధ్య మట్టి రోడ్డు



అధ్వానంగా భూషణరావుపేట- ఆత్మకూర్ రోడ్డు

కథలాపూర్: 'దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న' చందంగా మారింది కథలాపూర మండలంలోని రోడ్ల పరిస్థితి.. రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరైనా పనులు మాత్రం ప్రారంభం కావడం లేదు. మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా మారాయి. మట్టిరోడ్లను తారురోడ్డుగా మార్చాలని ఏళ్లుగా ప్రజలు విన్నవించుకున్నారు. ఎట్టకేలకు గతేడాది ఆగస్టు నెలలో ఆయా గ్రామాలకు వెళ్లే మూడు రోడ్లకు గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఇప్పటికీ పనులు ప్రారంభం కాకపోవడంతో అధ్వానంగా ఉన్న రోడ్లు అభివృద్ధికి నోచుకుంటాయా లేదా అని ఆయా గ్రామాల ప్రజలు నిరీక్షిస్తున్నారు.

7 నెలలు గడిచినా..

కథలాపూర్ మండలం భూషణరావుపేట నుంచి మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ వెళ్లేందుకు 2 కిలోమీటర్ల తారు రోడ్డు నిర్మాణానికి రూ. 2 కోట్లు, చింతకుంట నుంచి కథలాపూర్ శివారులోని గుండు పెరమాండ్ల ఆలయం వరకు రూ. 2 కోట్లు, పోసానిపేట నుంచి దూలూర్ వరకు రూ. 3 కోట్లు మంజూరయ్యాయి. ఈ మూడు రోడ్ల పనులు చేపట్టేందుకు గతేడాది ఆగస్టు నెలలో పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని సీఆర్ఆర్ నిధులు కేటాయించారు. మట్టి, రాళ్ల రోడ్లు తారు రోడ్లుగా మారుతున్నాయని, ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. నిధులు మంజూరై సుమారు 7 నెలలు గడిచినా.. తట్టెడు మట్టి పనులు చేయకపోవడం దారుణమని ఆయా గ్రామాల ప్రజలు అధికారులు, పాలకుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గుంతలు, రాళ్ల రోడ్ల నుంచి రాకపోకలకు ఇబ్బందిపడుతున్నామని.. ఇకనైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు దృష్టిసారించి రోడ్ల పనులు ప్రారంభమయ్యేలా చొరవ తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



ప్రతిరోజూ భూషణరావుపేట నుంచి ఆత్మకూర్ వైపు వ్యవసాయ పనులకు బైక్‌పై వెళ్తుంటాం. వర్షాలకు రోడ్డంతా దెబ్బతిని కంకర రాళ్లు తేలాయి. బైక్‌పై ఒక్కరు వెళ్లితేనే అదుపు తప్పి పడిపోతామని భయపడుతున్నాం. వర్షాకాలంలో పంటలు సాగుకు అవసరమయ్యే వస్తువులను తీసుకుపోవుడు కష్టమవుతోంది. ప్రజాప్రతినిధులు స్పందించి ఈ రోడ్డును తారు రోడ్డుగా మార్చాలి.

– గడ్డం దేవారెడ్డి, భూషణరావుపేట

సకాలంలో పనులు చేయాలి



చింతకుంట నుంచి కథలాపూర్ వరకు తారు రోడ్డుకు నిధులు మంజూరైనట్లు అప్పట్లో ప్రకటించారు. ఈ రోడ్డు పూర్తయితే త్వరగా కథలాపూర్‌కు చేరుకునే వీలుంది. నిధులు మంజూరైనా ఇప్పటికీ పనులు ప్రారంభించకపోవడం సరికాదు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే పనులు త్వరగా చేయించాలి.

– కేసరి సాయన్న, చింతకుంట

ఓటుహక్కు వినియోగంపై అవగాహన ర్యాలీలు





కోరుట్ల, ఇటిక్యాలలో ర్యాలీల్లో పాల్గొన్న అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

కోరుట్ల: పట్టణంలో ఐ ఓట్ ఫర్ షూర్‌లో భాగంగా ఓటు హక్కు వినియోగంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ స్త్రీ, పురుషుడు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆర్డీవో ఆనంద కుమార్ అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిషన్, బీఎల్‌ఓలు, అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: మండలంలోని అయిలాపూర్‌లో ఐ ఓట్ ఫర్ షూర్‌లో భాగంగా ఓటు హక్కు వినియోగంపై బీఎల్‌వోల ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నవీన్, బీఎల్‌వోలు రాజమణి, మంజుల, కాశేశ్వరి, శైలజ, విమల, సుమతి, సీఏలు రమాదేవి, కవిత, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పెగడపల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో వందశాతం ఓటు హక్కు వినియోగించుకోవాలని అధికారులు ఓటర్లను కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీవో మహేందర్, ఆర్ఐ శ్రీనివాస్, కార్యదర్శి ప్రవీణ్, ఏపీఎం సమత, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

మల్లాపూర్: ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ వీర్‌సింగ్ అన్నారు. మండల కేంద్రంలో ఓటుహక్కు వినియోగం, ఓటర్ నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించి ర్యాలీ చేపట్టారు. గ్రామాల్లో 18 ఏళ్లు నిండిన అర్హులైన యువత ఓటరుగా నమోదు చేయించుకునేలా బీఎల్వోలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఈవో భూమేశ్వర్, ఆర్ఐ సురేశ్, జూనియర్ అసిస్టెంట్ సలీం, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు శాతం పెంచాలి

ఇబ్రహీంపట్నం: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేసి ఓటు శాతాన్ని పెంచాలని తహసీల్దార్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు ఒక వజ్రాయుధం అని, ప్రతి ఒక్కరూ 100 శాతం ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ గంగాధర్, పాఠశాల హెచ్‌ఎం రాజన్న, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెల్గటూర్ : ఎండపల్లి మండలం గుల్లకోట హైస్కూల్‌లో ఓటు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా, నిజాయితీగా ప్రతీ ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవికాంత్, ఎంఈవో బత్తుల భూమయ్య, హెచ్‌ఎం రాంచదర్ తదితరులు పాల్గొన్నారు.

రాయికల్: ప్రతి ఒక్కరూ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఖయ్యూం అన్నారు.శుక్రవారం మండలంలోని ఇటిక్యాలలో ఓటరు నమోదుపై ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాధ ఆదిరెడ్డి,సింగిల్‌విండో చైర్మన్ మహిపాతిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఉపాధి పనులు పరిశీలన

మల్యాల: కూలీలు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని డీఆర్‌డీవో పీడీ సంపత్‌రావు అన్నారు. మండలంలోని ముత్యంపేటలో ఉపాధి పనులను శుక్రవారం పరిశీలించారు. కూలీలు తవ్విన కందకాలు, గ్రామంలోని నర్సరీని పరిశీలించారు. పనిచేసే చోట కూలీలకు నీటి సౌకర్యంతోపాటు ఫస్ట్ ఏయిడ్ కిట్ ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి జాబ్ కార్డులు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో స్వాతి, ఏపీవో శ్రీనివాస్, ఈసీ మనోజ్, టీఏ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాష సాహిత్యం గొప్పది

జగిత్యాల: తెలుగు భాష సాహిత్యం ఎంతో గొప్పదని డీఈవో జగన్మోహన్‌రెడ్డి అన్నారు. ధర్మపురి జిల్లా పరిషత్ పాఠశాలలో తెలుగు పండిట్‌గా పనిచేస్తున్న గొల్లపల్లి గణేశ్ ఉస్మానియా యూనివర్సిటీ ఆచార్య సాగి కమలాకర్‌శర్మ ఆధ్వర్యంలో పరిశోధనలు చేసి తెలుగు భాష సాహిత్యం అనే పుస్తకాన్ని రచించారు. శుక్రవారం డీఈవోకు పుస్తకం అందజేయగా ఆయన మాట్లాడారు. తెలుగు భాష సాహిత్యం పుస్తకం డిగ్రీ, పీజీ స్థాయిలో తెలుగు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఆయన వెంట పీఆర్టీయూ జిల్లా కార్యదర్శి ఆనందరావు ఉన్నారు.

బస్ షెల్టర్ ప్రారంభం

కోరుట్ల రూరల్: మండలంలోని యూసుఫ్‌నగర్‌లో హనుమాన్ మందిరం వద్ద గ్రామానికి చెందిన మార్గం శోభన్ తన అమ్మమ్మ గంగూబాయి, తండ్రి మార్గం కిషన్ స్మారకార్థం రూ. 50 వేల వ్యయంతో నిర్మించిన బస్ షెల్టర్‌ను శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ గుగ్గిళ్ల సురేశ్ గౌడ్, మాజీ సర్పంచ్ సత్యనారాయణ గౌడ్, పల్లి తుక్కయ్య, శ్రీనివాస్,మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డిక్షనరీలు పంపిణీ

కథలాపూర్: మండలంలోని తక్కళ్లపెల్లి జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు కోరుట్ల పట్టణానికి చెందిన విశాల మెడికల్ షాపు యజమాని సాయికృష్ణ ఇంగ్లిష్ ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలను శుక్రవారం పంపిణీ చేశారు. విద్యార్థులు ఇంగ్లిష్‌పై పట్టు సాధించి ఉన్నత స్థాయికి చేరాలనే డిక్షనరీలను ఉచితంగా అందించినట్లు దాత సాయికృష్ణ పేర్కొన్నారు. సాయికృష్ణను ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రవీందర్, టీచర్లు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుడి రాజీనామా

జగిత్యాల: బీజేపీ నాయకుడు డాక్టర్ శైలేందర్‌రెడ్డి పార్టీకి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌కు రాజీనామా చేశారు. విజయ సంకల్ప సభకు ప్రధాని నరేంద్రమోదీ జగిత్యాలకు రాగా, తనను ఆహ్వానించకపోవడం కలిచివేసిందని, కొందరు నాయకుల అణిచివేత ధోరణి నచ్చక పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. పార్టీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి రాజీనామా లేఖ పంపించినట్లు పేర్కొన్నారు.

అంతర్జాతీయ జల దినోత్సవం

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం ఆత్మనగర్‌లో అంతర్జాతీయ జలదినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం అధికారులు ఇంటింటికీ వెళ్లి ఇంకుడుగుంతల నిర్వహణ, నీటి పొదుపుతో పాటు పలు విషయాలపై అవగాహన కల్పించారు.నీటిని వృథా చేయొద్దని,పొదుపుగా వాడుకోవాలని సూచించారు.అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్,కార్యదర్శి నిజామొద్దిన్,హెల్త్ ఆఫీసర్ కృష్ణవేణి,ఏఎన్ఎం వసంత, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి ప్రాముఖ్యతపై అవగాహన

కోరుట్ల రూరల్: మండలంలోని అయిలాపూర్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ జల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నీటి ప్రాముఖ్యతపై మహిళలకు అవగాహన కల్పించారు.నీటి పంపు వద్ద ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పోషణ పక్షోత్సవాల్లో బాలింతలకు తల్లి పాల ప్రాముఖ్యతను వివరించారు. సూపర్‌వైజర్ షమీమా సుల్తానా, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం

కొండగట్టు: కొడిమ్యాల మండల కేంద్రంలో కరీంనగర్ వివేకానంద డిగ్రీ,పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరం శుక్రవారం ముగిసింది. కొడిమ్యాల మండల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్సై సందీప్ పాల్గొని మాట్లాడారు.రక్తదానం ప్రాణదానంతో సమానం కాబట్టి యువత రక్తదానం సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. మాజీ ఉప సర్పంచ్ జీవన్‌రెడ్డి, రెవెన్యూ అధికారి బి.రాజమణి, ఎన్ఎస్ఎస్ ప్రోగాం అధికారి గోపి కృష్ణ, కె.సతీష్, తిరుపతి, రవిచందర్,సంతోశ్. వలంటీర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలన




పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

రాయికల్: అందరివారు అయోధ్య రాములవారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. మండలంలోని అయోధ్యలో రూ.20 లక్షల నిధులతో రాములవారి ఆలయంలో చేపట్టిన అభివృద్ధి పనులను శుక్రవారం పరిశీలించారు. శ్రీరామనవమి సందర్భంగా పనులను పూర్తి చేయాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు. ఆయన వెంట పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గుర్రం మహేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని భవాని శంకర ఆలయం, రామమందిరం హుండీలు శుక్రవారం లెక్కించారు. భవాని శంకర ఆలయ ఆదాయం రూ.2,29,140 రాగా, రామమందిరం ఆదాయం రూ.28,552 వచ్చినట్లు ఈవో వేణుగో పాల్ తెలిపారు. కార్యక్రమంలో రాజేంద్రశర్మ, రా ఘవ శర్మ, లవకుమార్, రవికిషన్, రాజు పాల్గొన్నారు.

శ్రీమన్నారాయణ స్వామి తిరు కల్యాణం



తిరు కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కోరుట్ల: పట్టణంలోని అష్టలక్ష్మీ ఆలయం పంచాదశ వార్షికోత్సవ పంచాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ అష్టలక్ష్మీ సహిత శ్రీమన్నారాయణ స్వామి తిరు కల్యాణ వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, కల్యాణం, హోమం నిర్వహించారు. భక్తులకు అల్పాహారం, భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బూరుగు రామస్వామి గౌడ్-సుభద్ర దంపతులు, అర్చకులు సముద్రాల శ్రీరామాచార్యులు, శ్రీనివాసాచార్యులు,శ్రీకాంతాచార్యులు, ఇందుర్తి మధుసుదనాచారి, తదితరులు పాల్గొన్నారు.



వరి పొలాలకు బీటలు..

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట శివారులో భూగర్భజలాలు అడుగంటి వరి పొలాలకు నీళ్లందక బీటలు వారాయి. బోరుబావుల్లో చుక్క నీరు రాని పరిస్థితి. ఎండిపోతున్న వరి పొలాలను కాపాడుకునేందుకు పలువురు బోరుబావులు వేయించినా నీటి జాడ లేదని రైతులు వాపోతున్నారు. గ్రామశివారుల భూములకు సాగునీరందించే ప్రధాన నీటి వనరు రాళ్లవాగు ప్రాజెక్టు కుడికాలువ తెగి నెలలు గడిచిన మరమ్మతు జాడలేదని రైతులు పేర్కొన్నారు. వరి పొలాలు కళ్లముందే ఎండిపోతుంటే రైతులు ఏమి చేయలేక కన్నీటిపర్యంతమవుతున్నారు. చేతికందే వరి పొలాలు సుమారు 300 ఎకరాల్లో ఎండిపోయినట్లు రైతులు తెలిపారు. వరి పంట సాగుచేసి ఆర్థికంగా నష్టపోయినా రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

గ్రామాల అభివృద్ధికి చేయూత అభినందనీయం

- కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



మినీ బస్‌షెల్టర్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

మల్లాపూర్ : గ్రామాల అభివృద్ధికి దాతలు చేయూత నివ్వడం అభినందనీయమని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మండలంలోని సిరిపూర్ సొసైటీ చైర్మన్ బద్దం అంజిరెడ్డి తన తండ్రి బద్దం తుక్కారెడ్డి, తమ్ముడు బద్దం అనిల్‌రెడ్డి స్మారకార్థం సిరిపూర్ గ్రామానికి అందించిన వైకుంఠరథం, నడికుడ గ్రామంలో నిర్మించిన మినీ బస్‌షెల్టర్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంజిరెడ్డి తండ్రి, తమ్ముడి జ్ఞాపకార్థం సామాజిక కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమన్నారు. గ్రామస్తుల సౌకర్యార్థం సొంత నిధులు వెచ్చించి వైకుంఠరథం,బస్‌షెల్టర్ నిర్మించి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. అంతకుముందు ముత్యంపేటలో బీఆర్ఎస్ నాయకుడు నాగరాజు టెంట్‌హౌజ్‌ను ప్రారంభించారు. కార్యక్రమాలలో జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కాటిపెల్లి సరోజన, వైస్ ఎంపీపీ గౌరు నాగేష్, ఎంపీటీసీ ఏనుగు రాంరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకోవడానికే వార్డుల్లో పర్యటన

మెట్‌పల్లి: ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించడానికే వార్డుల్లో పర్యటిస్తున్నట్లు ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. గుడ్ మార్నింగ్ కోరుట్లలో భాగంగా శుక్రవారం పట్టణంలోని 17 వార్డులో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న సమస్యల గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన చోట రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వనజ, నాయకులు పాల్గొన్నారు.

ఆటపాటలతో చిన్నారులకు విద్యాబోధన



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

జగిత్యాలరూరల్: చిన్నారులకు ఆటపాటలతో విద్యాబోధన అందిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య అన్నారు. శుక్రవారం జగిత్యాల రూరల్ తక్కళ్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కిశోర బాలికలకు రక్తహీనత నివారణ, పోషకాహారం, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు జ్యోత్స్న, నాగమణి పాల్గొన్నారు.

ఐసీడీఎస్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

పెగడపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న సేవలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మహేశ్వరి, సుభద్ర కోరారు. మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం పోషణ్ పక్వాడ్‌లో భాగంగా పోషకహారంపై గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులకు రక్తహీనత పరీక్షలు,అన్నప్రాసన, సామూహిక అక్షరభ్యాసం చేశారు. అనంతరం ప్రపంచ జలదినోత్సవం సందర్భంగా సేవ్ వాటర్–సేవ్ హెల్త్‌పై చైతన్య ర్యాలీలు చేపట్టారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతి రోజూ కనీసం 4 లీటర్ల నీటిని తాగాలి

సారంగాపూర్: ప్రతి రోజు ఒక్కరు కనీసం 4 లీటర్ల నీటిని తాగితే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లత అన్నారు. శుక్రవారం మండలంలోని లక్ష్మీదేవిపల్లి పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడలో భాగంగా విద్యార్థులకు తాగునీటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

హుండీ బహూకరణ



ఐరన్ హుండీ బహూకరిస్తున్న డీజీఎం

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శుక్రవారం ఐరన్ హుండీలను బ్యాంక్ డీజీఎం చేతుల మీదుగా బహూకరించారు. అనంతరం ఈవో శ్రీనివాస్ వారికి స్వామివారి శేషవస్త్రం కప్పి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ లీడ్ మేనేజర్, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

ధర్మపురి: పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో శుక్రవారం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రౌతు రాజేశ్, ఉపాధ్యక్షుడిగా రామడుగు రాజేశ్, జనరల్ సెక్రటరీగా బందెల రమేశ్, జాయింట్ సెక్రటరీగా మామిడాల శ్రీకాంత్ కుమార్, ట్రెజరీగా జాజాల రమేశ్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ బత్తిని ఇంద్రకరణ్ తదితరులను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని జూనియర్ సివిల్ జడ్జి శ్యామ్ ప్రసాద్, పీపీ రాజేశ్ సన్మానించి అభినందించారు.

మెట్‌పల్లి బార్ అసోసియేషన్ కార్యవర్గం..

మెట్‌పల్లి: బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా వెల్ముల రాంబాబు, సంయుక్త కార్యదర్శిగా రాంపల్లి జగన్, కోశాధికారిగా రాజేశ్‌శెట్టి, పలు విభాగాలకు కార్యదర్శులను ఎన్నుకున్నారు. కాగా అధ్యక్ష పదవికి పుప్పాల లింబాద్రి, ఆకుల సురక్ష, ప్రధాన కార్యదర్శి పదవికి తునికి వేణుగోపాల్, కట్కం వేణు పోటీ పడుతున్నారు. ఈ నెల 28న వీటికి ఎన్నికలు జరగనున్నాయి.

నగదు పట్టివేత

మెట్‌పల్లిరూరల్: బండలింగాపూర్ గండి హనుమాన్ ఆలయ సమీపంలోని అంతర్‌జిల్లా సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద శుక్రవారం తనిఖీల్లో నగదు పట్టుకున్నట్లు ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్ తెలిపారు. వాహనాలు తని ఖీ చేస్తుండగా ఓ కారులో రూ.69 వేల నగదు ఉన్నట్లు గుర్తించారు. నగదు సంబంధించిన ఆధారాలు లేవని ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున సీజ్ చేసినట్లు తెలిపారు.

పాఠశాలలో మాక్ పోలింగ్

ఇబ్రహీంపట్నం: మండలంలోని గోధూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఓటు హక్కు ఎలా వినియోగించుకోవాలో విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. విద్యార్థులే ఎన్నికల అధికారులుగా వ్యవహరించి ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మధు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.